నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 27 జూన్ 2024 | HYDERABAD

ఈవీడీఎం కమిషనర్‌గా రంగనాథ్ బాధ్యతల స్వీకరణ

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ ఆధ్వర్యంలో నేతలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారంపై వివరించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్.. కార్మికులకు ఎల్లవేళ లా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కాట్రావత్ గోపాల్ నాయక్, శేఖర్, పరశురాం, మహానంది తదితరులు పాల్గొన్నారు. -సిటీబ్యూరో

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

చిరుత కాదు..అడవిపిల్లి

శంషాబాద్ మండలంలోని ఘాన్సీమియాగూడలో సంచరిస్తున్నది.. చిరుత పులి కాదు.. అడవి పిల్లి అని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. మూడు రోజులుగా గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు వదంతులు రావడంతో అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. రెండు బోన్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే మంగళ వారం రాత్రి సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను చూశాక.. అది అడవి పిల్లిగా గుర్తించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి మహ్మద్ అర్షత్ అమ్మీద్ తెలిపారు. ఇక గ్రామస్తులు భయపడాల్సిన అవసరంలేదన్నారు.
- శంషాబాద్ రూరల్, జూన్ 26



గోల్కొండ బోనాల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, చిత్రంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బోనాలు ఘనంగా చేసుకుందాం..

దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ

మెహిదీపట్నం, జూన్ 26: గోల్కొండ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ తెలిపారు. బుధవారం గోల్కొండ కోట జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో నెల రోజుల పాటు జరిగే బోనాలను పకడ్బందీగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ తెలంగాణ ఆషాఢ మాసం బోనాలు గోల్కొండ కోట జగదాంబిక ఎల్లమ్మ ఆలయం నుంచే ప్రారంభం కావడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. ఈ సంవత్సరం తెలంగాణ దశాబ్ది బోనాల ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి 20 కోట్ల రూపాయలను కేటాయించినట్లు వెల్లడించారు. గోల్కొండ బోనాలను ప్రజలందరూ కలిసికట్టుగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. గోల్కొండ కోటకు బోనాలతో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, సమావేశానికి హాజరు కాని అధికారులపై మంత్రి సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోల్కొండ కోటలో నీటి కొరత ఉండొద్దని, కోటకు వచ్చే రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, కార్పొరేషన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, దేవాదాయ కమిషనర్ హనుమంత్‌రావు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత్, దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్ కుమార్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఈవో శ్రీనివాస రాజు, కాంగ్రెస్ నాయకులు ఉస్మాన్‌బిన్ అల్ హజ్రీ, జీవన్ సింగ్, కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి తదితరులు పాల్గొన్నారు.

కాగా, కులవృత్తుల వారికి భత్యం 5000 రూపాయలు చేయాలని సాయిబాబాచారి కోరడంతో మంత్రి కొండ సురేఖ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కులవృత్తుల సంఘం నాయకులు మంత్రి కొండ సురేఖకు గోల్కొండ బోనాల చిత్రపటాన్ని బహూకరించారు.

విదేశీ మీడియాకు.. గోల్కొండ బోనాల విశిష్టత..

గోల్కొండ బోనాల సన్నాహక సమావేశం సందర్భంగా కోటకు వచ్చిన విదేశీ మీడియా ప్రతినిధులకు గోల్కొండ కోట బోనాల విశిష్టతను దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ వివరించారు. నెల రోజుల పాటు బోనాలు ఏ విధంగా జరుగుతాయో వివరించిన ఆమె.. ఇక్కడ బోనాలు అందరూ కలిసికట్టుగా నిర్వహిస్తారని, మత సామరస్యాన్ని చాటుతారని చెప్పారు.

గ్రేటర్‌కు బోనాల శోభ

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే విధంగా బోనాల ఉత్సవాలకు గ్రేటర్ సన్నద్ధమవుతున్నది. ఈ మేరకు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ఈమేరకు రూ. 20కోట్లను మంజూరు చేసింది. బోనాల కోసం ప్రభుత్వ దేవాలయాలకే కాకుండా ప్రైవేటు ఆలయాలు సుమారు 3 వేల దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించనున్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా బోనాల ఉత్సవాలను నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రహదారుల మరమ్మతులు, శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో దేవాలయాల పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు జరగనున్నాయి.

నేడు పలు ప్రాంతాల్లో నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి నీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయి స్కీం ఫేజ్-2లోని కోదండాపూర్ పంప్‌హౌజ్‌లో రెండో పంపు ఎన్ఆర్‌వీ వాల్వ్ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. దీంతో అత్యవసరంగా నీటి సరఫరా నిలిపివేసే పరిస్థితి నెలకొందని, యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉండడంతో పలు ప్రాంతాలలో నీటి సరఫరా అంతరాయం ఏర్పడుతుందని జలమండలి అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల కారణంగా జల మండలి ఓ అండ్ ఎం డివిజన్లు 2,3,4,5,7,9 , 10, 13, 14, 16, 20 పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం(నేడు) తాగునీటి సరఫరాలో కొన్ని చోట్ల పూర్తి అంతరాయం, మరికొన్ని చోట్ల పాక్షిక అంతరాయం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

మిరాలం, ఎన్‌పీఏ, బాలాపూర్, మైసారం, బార్కాస్, భోజగుట్ట, ఆళ్లబండ, మేకలమండి, భోలక్‌పూర్, చిలకలగూడ, తార్నాక, లాలాపేట్, బౌద్ధనగర్, మారేడ్‌పల్లి, కంట్రోల్‌రూం, రైల్వేస్, కంటోన్మెంట్, ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ, హస్మత్‌పేట్, ఫిరోజ్‌గూడ, గౌతంనగర్, వైశాలి నగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కాపురీ కాలనీ, మహేంద్ర హిల్స్, ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిలుకానగర్, బీరప్ప గడ్డ, బుద్వేల్, శాస్త్రిపురం, మీర్‌పేట్, బడంగ్‌పేట, శంషాబాద్ ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడనున్నదని, వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

తాత్కాలిక రక్షణగా భూముల చుట్టూ జేసీబీతో కందకం (గుంత) తవ్వుతున్న దృశ్యం

100 ఎకరాలు మాయం!

మియాపూర్ భూముల రక్షణలో హెచ్ఎండీఏ వైఫల్యం

2003లో 550 ఎకరాలను అప్పగించిన రెవెన్యూ శాఖ

కోర్టు కేసులతో ఆ భూములను గాలికొదిలేసిన హెచ్ఎండీఏ అధికారులు

క్రమంగా ఆక్రమణలతో ఏకంగా రూ.3వేల కోట్ల భూములు అన్యాక్రాంతం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 26 (నమస్తే తెలంగాణ): ఆస్తి ఎంత ఉన్నా.. కూర్చుని తింటే కరిగిపోతుందంటారు. అదేరీతిన భూమి వందల ఎకరాలు ఉన్నా.. పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే అవి హారతి కర్పూరం అవుతాయి. అందుకు నిదర్శనమే.. మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూములు. రెండు దశాబ్దాల కిందట రెవెన్యూ శాఖ అప్పగించిన భూమిని అధికారులు పట్టించుకోలేదు. దీంతో చుట్టూ కమ్ముకొచ్చిన కబ్జాలతో ఒకటీ.. అరా కాదు! ఏకంగా వందెకరాలకు పైగా సర్కారు భూమి మాయమైంది. ఇక్కడ ఎకరం కనీసం రూ.30 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అంటే.. హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంతో రూ. 3వేల కోట్లకు పైగా విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇటీవల ఉన్న భూమికి కూడా ఎసరు రావడంతో అధికారులు ఇప్పుడు రక్షణ చర్యలకు దిగారు. రూ. 2.65 కోట్లతో ఫెన్సింగ్ కోసం టెండర్లు పిలిచారు. మరి.. ఈ రెండున్నర కోట్లు రెండు దశాబ్దాల కిందటే వెచ్చిస్తే అంతకు వెయ్యి రెట్లకు పైగా విలువైన భూమిని కాపాడినట్లయ్యేది.

2003 సంవత్సరంలో..

మియాపూర్‌లోని సర్వే నంబర్ 100, 101 సర్వే నంబర్లలో సుమారు 550 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. 2003లో అప్పటి ప్రభుత్వం ఈ భూములను హుడా (ప్రస్తుతం హెచ్ఎండీఏ)కు అప్పగించాలని నిర్ణయించింది. రెవెన్యూ శాఖ ఆ ఏడాదిలోనే ఆ భూములను హుడాకు బదిలీ చేసింది. అయితే ఆ భూముల్ని వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం వినియోగించాలని గత ప్రభుత్వాలు యోచించాయి. కానీ దానిపై న్యాయపరమైన చిక్కులు తెరపైకి వచ్చాయి. ఆ భూములు తనవంటూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఇలా సుప్రీం కోర్టు వరకు కేసుల చిక్కులు వెళ్లాయి. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో ఈ భూముల్ని వేలం వేసేందుకు అప్పటి ప్రభుత్వాలు ప్రతిపాదించినప్పటికీ సుప్రీం కోర్టులో కేసులు ఉండటంతో ఏమీ చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆ భూముల రక్షణ చర్యలు తీసుకుంటే బాగుండేది. కానీ నిర్లక్ష్యం వహించడంతో సరిహద్దుల నుంచి కబ్జాలు ముంచుకొచ్చాయి. పక్క సర్వే నంబర్లు, బై నంబర్లతో రిజిస్ట్రేషన్లు భారీ ఎత్తున జరిగాయి. విషయం తెలిసినప్పటికీ అధికారులు చర్యలకు ఉపక్రమించకపోవడంతో ప్రతి ఏటా కబ్జాలు పెరుగుతూనే ఉన్నాయి. ఇలా వందెకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమైనట్లు అధికారుల ప్రాథమిక సర్వేలో తేలుతూనే ఉన్నది.

మేల్కొన్న హెచ్ఎండీఏ...

గత వారంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తున్నారంటూ పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో వేలాది మంది మియాపూర్ భూముల దగ్గరికి తరలిరావడం తెలిసిందే. మూడు రోజుల పాటు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. దాదాపు ఆరువేల మంది వరకు అక్కడి చేరుకోవడంతో హెచ్ఎండీఏ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసులు భారీ ఎత్తున అక్కడికి వచ్చి చివరకు లాఠీచార్జీ చేస్తేగానీ పరిస్థితి అదుపులోకి రాలేదు. అయితే ఈ పరిణామంతో హెచ్ఎండీఏ అధికారుల్లో కదలిక వచ్చింది. ఇప్పటికైనా ఉన్న భూముల్ని రక్షించుకోవాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా మియాపూర్‌లోని భూముల లెక్క తీస్తే ప్రస్తుతం అక్కడ 445 ఎకరాలు ఉన్నట్లుగా తేలింది. అంటే రికార్డుల్లో కంటే ఏకంగా 105 ఎకరాల భూములు చేజారిపోయినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో రూ.2.65 కోట్లతో ఆ భూమికి ఫెన్సింగ్ వేసేందుకు టెండర్లు పిలిచారు. టెండరు ప్రక్రియ పూర్తయ్యే వరకు తాత్కాలిక రక్షణగా ఆ భూముల చుట్టూ జేసీబీతో కందకం (గుంత) తవ్వుతున్నారు. తద్వారా ఆ భూముల్లోకి ఎవరూ ప్రవేశించకుండా ఈ పనులు చేపట్టారు.

8500 ఎకరాల భూములు..

ప్రస్తుతం అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం హెచ్ఎండీఏ పరిధిలో ఆ విభాగానికి 8500 ఎకరాల భూములు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. కానీ వాటి రక్షణ చర్యలు మాత్రం ఇప్పుడు చేపట్టడం లేదు. కేవలం డిజిటలైజేషన్ విధానంలో మార్కింగ్ చేయాలని మాత్రమే నిర్ణయించినట్లు తెలిసింది. కానీ వీటి సరిహద్దులు కూడా నిర్ణయించి... ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తేనే ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా ఉంటాయని పలువురు సూచిస్తున్నారు.

రీడింగ్‌ల నమోదు ఆలస్యంపై అపోహలొద్దు

డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో: విద్యుత్ బిల్లులు కొన్ని సందర్భాల్లో రెండు, మూడు రోజులు ఆలస్యంతో తీసిన రీడింగ్‌లపై అపోహలు వద్దని డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమాచారం కోసం విద్యుత్ సంస్థ వెబ్‌సైట్ (www.tgsouthernpower.org) లో ఎనర్జీ చార్జ్ క్యాలుక్‌రేటర్ ఫర్ డొమెస్టిక్ సర్వీసును పొందుపరిచామని సీఎండీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎవరైనా సరే వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ మీటర్ నంబర్‌ను అందులో ఎంటర్ చేయడం ద్వారా ఎంత బిల్లు వస్తుందో తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. డిస్కం పరిధిలో బిల్లులను 99.5 శాతం నెల రోజులకే ఇస్తుంటామని, అలా కానీ పక్షంలో వినియోగదారులు నష్టపోవద్దనే ఉద్దేశ్యంతో రీడింగ్ తీసిన రోజులతో సంబంధం లేకుండా కేవలం నెల రోజులకే బిల్లులు జారీ చేసేలా స్పాట్ బిల్లింగ్ యంత్రంలో ఏర్పాట్లు చేశామన్నారు.

అనుమతుల్లో జాప్యం వద్దు

భవన నిర్మాణాలు, లేఅవుట్ల దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

సిటీబ్యూరో: భవన నిర్మాణ, లే అవుట్ల అనుమతుల్లో ఎక్కడా జాప్యం లేకుండా దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని, అనుమతుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుదారులు అనుమతి పొందేలా ప్లానింగ్ విభాగం అధికారులు పనిచేయాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. మెట్రోపాలిటన్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన కీలకమైన విభాగాలపై సుదీర్ఘంగా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టిన కమిషనర్ మంగళవారం ఇంజినీరింగ్ విభాగం పైనా, బుధవారం ప్లానింగ్ విభాగంపై ఎక్కువ సమయం సమీక్షించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏలో ప్లానింగ్ విభాగం పరిధి, ఏ ప్రాంతం నుంచి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని, ఎలాంటి దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని తెలుసుకున్నారు. మొత్తం 4 జోన్‌లైన శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్‌లలో ఎక్కువగా శంకర్‌పల్లిలో హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులతో పాటు భవన నిర్మాణాలు, లేఅవుట్ల కోసం దరఖాస్తులు రాగా, ఆ తర్వాత శంషాబాద్, మేడ్చల్‌లు ఉన్నాయి. ప్రణాళిక విభాగంలోని ప్లానింగ్ ఆఫీసర్స్‌తో పాటు జేపీఓ, ఏపీఓల పనితీరు ఎలా ఉందని ఆరా తీశారు జోన్‌ల వారీగా అనుమతుల జారీ ఎలా ఉందన్న దానిపైనే ప్లానింగ్ విభాగం డైరెక్టర్లతో చర్చించారు.

కాంగ్రెస్ సర్కారు అధికారంలో వచ్చినప్పటి నుంచి నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త రోడ్లపై పేరుకుపోతున్నది. దీంతో 'నమస్తే' బల్దియా నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ..కథనాలు ఇస్తున్నది. ఈ నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వం..పలు ప్రాంతాల్లో వ్యర్థాలు వేసే చోట.. బల్దియా ఉద్యోగులను నియమించింది. వ్యర్థాలు వేస్తే రూ. 1000 జరిమానా విధిస్తామంటూ..బ్యానర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. యూసుఫ్‌గూడ కల్యాణ్‌నగర్‌లోని దృశ్యమిది.

నిందితుడు మహేందర్ రెడ్డి

తహసీల్దార్ పేరిట వసూళ్లు

మేడ్చల్, జూన్ 26 : తహసీల్దార్ పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని సోమరం గ్రామంలో గంగాస్థాన్ పేరుతో బీఎల్‌రెడ్డి వెంచర్ చేస్తున్నాడు. మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి ఆ వెంచర్ వద్దకు వెళ్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చానని, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బీఎల్ రెడ్డి మహేందర్ రెడ్డికి రూ.2 లక్షలు చెక్ రూపంలో ఇచ్చాడు. ఆ తర్వాత మళ్లీ వెంచర్ వద్దకు వెళ్లి, పైస్థాయి అధికారులకు ఇవ్వాలంటూ రూ.3 కోట్లు డిమాండ్ చేశాడు. దీంతో వెంచర్ యజమాని తహసీల్దార్ శైలజను కలిసి జరిగిన విషయాన్ని వివరించాడు. దీంతో ఆమె మహేందర్‌రెడ్డికి తహసీల్దార్ కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం పేరుతో డబ్బులు వసూలు చేసిన మహేందర్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నిస్తున్న రైతు సురేశ్‌బాబును అడ్డుకుంటున్న పోలీసులు

రైతు ఆత్మహత్యాయత్నం

శంషాబాద్ రూరల్, జూన్ 26 : రెవెన్యూ అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడం లేదంటూ.. బుధవారం ఓ రైతు శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించడం కలకలం సృష్టించింది. బాధిత రైతు సురేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం శంకరాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య- కమలమ్మకు ఘాన్సీమియాగూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4/7, 4/8 లో 8 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నది. గతంలో పట్టాభూమిగా ఉన్న ఈ స్థలం ప్రస్తుతం సీలింగ్‌గా మార్చడంతో రైతు బంధు, రైతు బీమా పథకాలు రావడం లేదని వీరి కుమారుడు సురేశ్‌బాబు తెలిపారు. 9 నెలల కిందట తన తల్లి కమలమ్మ పేరున ఉన్న భూమి రికార్డులు ధరణిలో తప్పుగా వచ్చిందన్నారు. దీంతో తాము తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు మా సమస్యను పరిష్కరించడం లేదంటూ సురేశ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సురేశ్‌బాబు ఆత్మహత్యకు యత్నించడంతో ఒక్కసారిగా శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తన సిబ్బందితో చేరుకొని సురేశ్‌బాబుకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. కాగా, ఈ విషయంపై రెవెన్యూ అధికారులు మాత్రం తమకు ఎలాంటి సంబంధం లేదంటున్నారు.